
ప్రజాశక్తి
ఆదివారం 29 సెప్టెంబర్ 2024
5
పార్వతీపురం మన్యం



30న సాలూరులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిఎస్‌పివి)ను సోమవారం సాలూరులో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. సాలూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుండి నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున ప్రజలు తమ సమస్యలు స్వయంగా వచ్చి తెలపవచ్చని ఆయన చెప్పారు. అధికారులు అందరూ సాలూరులో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.ఎస్.పి.వి)కు హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

నష్టాల బారిన పామాయిల్ రైతు



లబోదిబోమంటున్న అన్నదాత

సాంప్రదాయ పంటలే కాకుండా వాణిజ్యపంటలపై మొగ్గు చూపాలని, వాణిజ్యపంటల సాగుతో రైతు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాడని అధికారులు అవగాహన కల్పించారు. అధికారుల సూచనలతో వాణిజ్య పంటల సాగుపై రైతులు మొగ్గు చూపారు. అంతవరకూ బాగానే ఉంది. అయితే ఆ పంటలకు గిట్టుబాటు ధర, మార్కెట్ సదుపాయం కల్పించడంలో అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు నష్టాల బారినపడుతున్నారు. అలాంటిదే పామాయిల్ రైతుల పరిస్థితి.

ప్రజాశక్తి - సాలూరురూరల్

పామాయిల్ సాగు లాభదాయకంగా ఉంటుందని ఈ ప్రాంతంలో అనేక మంది రైతులు ఈ పంట సాగుకు ముందుకొచ్చారు. అయితే రాను రానూ దీని రేటు చాలా దారుణంగా పడిపోవడంతో రైతులు అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. మండలంలో సుమారు 5వేల ఎకరాల్లో పామాయిల్ సాగవుతోంది. ఈ ప్రాంతంలో ఉమ్మడి గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి వచ్చిన రైతులు ఈ పంటను మొదట పండించడంతో అది లాభదాయకంగా ఉండడంతో ఈ ప్రాంత రైతులు కూడా ఆ పంటను సాగు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం పామాయిల్ పంట ధరలు పతనంతో కనీసం పెట్టుబడులు కూడా రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్నేళ్ల క్రిందట విదేశాల నుంచి దిగుమతులు లేకపోవడంతో ఇక్కడ ధరలు పెరిగాయి. ఇప్పుడు విదేశాల నుంచి దిగుమతులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో రైతులు ఏమి చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. సాలూరు మండలంలో మెట్ట ప్రాంతం ఎక్కువగా ఉన్న మామిడిపల్లి, కందులపదం, అన్నంరాజు వలస, తోనాం, కురుకుట్టి, తుండ, మావిడి, కొట్టు పరువు, మరిపల్లి ప్రాంతాల్లో అధికంగా ఈ పంట మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ముఖ్యంగా ఈ పంట వేసిన నాలుగేళ్ల ఎటువంటి దిగుబడి రాదు. అప్పుడు దీని మీద ఎరువులు, కలుపుతీతకు ఖర్చులు భారీగానే పెట్టాల్సి వస్తుందని, ఆ తర్వాత 40ఏళ్ల వరకు ఇక మొక్కను తీయకుండా దాని మీద వచ్చే పంటను అమ్ముకోవచ్చుననే ఆశతో ఈ పంట మీద రైతులు ఎక్కువగా వేయడానికి మొగ్గు చూపుతున్నారు. కరోనా సమయంలో టన్ను సుమారు రూ.23వేలు ధర పలకడంతో ఈ ప్రాంతంలో 3,4 ఎకరాలు ఉన్న రైతులు సాగు చేశారు. తీరా పంట చేతికొచ్చిన సమయానికి టన్ను రూ.12 వేలు నుంచి రూ.13వేలకు పడిపోవడంతో చాలా నష్టపోతున్నారు. ఒకసారి ఆ మొక్క నాటిన తర్వాత దాన్ని తీసి మరో పంటను వేసుకోవడానికి వీలుపడదు. దీంతో ఉన్న పంట సాగు చేయలేక, వాటిని తీయలేక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఐదేళ్ల కిందట మొక్కలను వేయడానికి, వాటి పెట్టుబడులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడి సాయం కింద ఏడాదికి కొంత నగదు ఇచ్చేది. అయితే గత ప్రభుత్వం పూర్తిగా పట్టుబడి సాయం ఇవ్వలేదు. దీంతో మొక్కలను ఒక్కొక్క రూ.250 పెట్టి కొనుగోలు చేసుకోవాల్సి వస్తుంది. ఎకరాకు సుమారు రూ.30వేలు నుంచి రూ.40వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. ఎకరాకు 4,5టన్నులు పంట వస్తుందని ధరలు లేకపోవడంతో తీవ్రంగా నష్ట పోతున్నట్లు సొంత భూమి ఉన్న వారి పరిస్థితి ఇలా ఉంటే కౌలుకు తీసుకున్నవారి పరిస్థితి ఇంకా దారుణంగా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వాలు పామాయిల్ సాగు చేసే రైతులకు గిట్టుబాటు ధరలు వచ్చేలా, విదేశాల నుంచి దిగుమతులు తగ్గించినట్లైతే రైతులు నష్టాల బారి నుంచి బయట పడతారు. ప్రధాన పంటల్లో అంతర్ పంటగా కొన్ని సాగు చేద్దామన్నా అసలు పంట దిగుబడి వస్తుందో రాదోనన్న భయం రైతులను వెంటాడుతుంది.

పామాయిల్ రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలి

సాంప్రదాయ వ్యవసాయం చేసినట్లయితే పెట్టుబడులు అధికమని, కూలీలు కూడా ఎక్కువ మంది అవసరమవుతారని, లాభాలు కూడా రావనే ఉద్దేశ్యంతో ఈ పంటలను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నాం. తీరా ఇప్పుడు ఈ పంట సాగు చేస్తున్న రైతులు తీవ్ర నష్టపోతున్నారు. తెలంగాణలో ఇస్తున్నట్లు ఇక్కడ కూడా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పామాయిల్ సాగు చేస్తున్న రైతులకు కొంత పెట్టుబడి సాయం చేయాలి.

పద్మాల సురేష్,
పామాయిల్ రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షులు,

ప్రభుత్వం స్పందించాలి

నేను 8 ఎకరాల్లో పామాయిల్ సాగు చేస్తున్నాను. పంట వేసి 8 ఏళ్లు అవుతుంది. ఈ 8ఏళ్లలో నాలుగేళ్లు మొక్క పెరిగే వరకు పెట్టుబడులు పెట్టాల్సి వస్తుంది. మిగిలిన నాలుగేళ్లు పంట మీద కొంత ఆదాయం వస్తుంది. కరోనా సమయంలో వచ్చిన ధరను ఎప్పుడు చూడలేదు. అప్పుడే కొంత ఆదాయాన్ని చూశాం. ఇప్పుడు మాత్రం నష్టాలు చూస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం విదేశాల నుంచి పామాయిల్ దిగుమతులు చేయడంతో నష్టపోతున్నాం. ఇలాగే ప్రభుత్వం వ్యవహరించినట్లైతే ఈ వ్యవసాయాన్ని వదులుకోవాల్సిందే.

హరి వెంకటరమణ,
రైతు, మామిడిపల్లి.

ఉద్రిక్తత

చెత్త తొలగించాలని ధర్నా నగర పంచాయతీ కార్యాలయం వద్ద బైఠాయింపు




ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు నాయకులు దావాల రమణారావు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న చెత్తను తొలిగించాలని పట్టణ పౌరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన ధర్నా ఉద్రిక్తతకు దారితీసింది. నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావుకు, ఆందోళనకారులకు మధ్య వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. కార్యాలయం లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డగించగా కమిషనర్‌ను ఆందోళనకారులు నిలదీశారు. సమస్య పరిష్కరించ కుండా అడ్డుకోవడమేంటని కమిషనర్‌ను ప్రశ్నించారు. అనంతరం కార్యాలయం లోపలికి చేరుకుని రెండో ద్వారం ముందు బైఠాయించారు. 13,15,16 వార్డు కౌన్సిలర్లు బాసూరు కాంతారావు, తుమ్మగుంట శంకరరావు, కడగల రమణ మద్దతు తెలిపి బైఠాయించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎం.తిరుపతిరావు, పట్టణ పౌరుల సంక్షేమ సంఘం కన్వీనర్ దావాల రమణా రావు తదితరులు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలంటే లెక్క లేదా అంటూ ప్రశ్నించారు. మూడు వార్డుల ప్రజలతో పాటు వ్యాపార వర్గాలు కూడా ఇబ్బంది పడుతున్నా పట్టించుకోక పోవడానికి కారణమేమటని ప్రశ్నించారు. ఈనెల 2న ధర్నా చేస్తే, వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినప్పటికి ఇంతవరకు పరిష్కారించలేదని అన్నారు. ఇక్కడ చెత్త వేయడం వల్ల పలువురు జ్వరంతో బాధపడుతున్నారని, ఇదేనా ప్రజా ఆరోగ్యమంటూ నిలదీశారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ అనేక ప్రాంతాల్లో స్థలాలు గుర్తించామని, అయితే వివాదాలు రావడంతో నిలిచిపోతున్నాయని, దీనిపై దృష్టి పెడతామని చెప్పగా, నాయకులు అడ్డుతగిలారు. తమకు స్పష్టమైన హామీ ఇవ్వాలని, కౌన్సిల్ సమావేశంలో చర్చించి దీనిపై తీర్మానం చేయాలని పట్టుపట్టారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. అక్కడికి చేరుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, టిడిపి సీనియర్ నేత పల్లా కొండలరావు, చైర్ పర్సన్ యందవ రాధా కుమారి, టిడిపి పట్టణ అధ్యక్షులు గంటా సంతోష్ నాయకులతో మాట్లాడారు. అయితే ఆందోళనకారులు నగర పంచాయతీ అధికారులు, పాలకవర్గం తీరుపై తప్పు పట్టారు. పట్టణానికి దూరంగా వేయకుండా జనావాసం మధ్య చెత్త వేయడమేమిటని నిలదీశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో టిడి పారాపురం దగ్గర కేటాయించిన స్థలం అనువైందని, కోర్టు క్లియరెన్స్ పొంది అక్కడ ఏర్పాటు చేసుకుంటే మంచిదని అభిప్రాయం వ్యక్తం చేశారు. కొండలరావుతో పాటు సంతోష్ రేపటి నుంచే చెత్తను విశాఖలో జిందాల్ కంపెనీకి పంపిస్తామని హామీ ఇచ్చారు. ప్రత్యామ్నాయ స్థలం కూడా ఇప్పిస్తామని చెప్పారు. దీనిపై దావాల రమణారావు మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశంలో చర్చించి తీర్మానం చేయాలన్నారు. చెత్త వెంటనే తరలించి శాశ్వత పరిష్కారానికి తీర్మానించాలన్నారు. దీనికి కొండలరావు హామీ ఇచ్చారు. సిఐటియు జిల్లా నాయకులు ఎం.తిరుపతి రావు మాట్లాడుతూ డంపింగ్ యార్డు పట్టణానికి 5కిలోమీటర్ల దూరంలో ఉండాలనే నిబంధన ఉందని, అయితే చెత్త వేసినప్పుడు ముందే తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి వేస్ట్ మేనేజ్మెంట్ ఏర్పాటు చేయాలన్నారు.

2న పిఎం జుగా ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రధానమంత్రి జనజాతీయ ఉన్నతి గ్రామ అభియాన్ (పిఎం జుగా) కార్యక్రమాన్ని అక్టోబర్ 2న ప్రారంభించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. పిఎం జుగా, పిఎం జన్‌మన్ (ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్) కార్యక్రమాల కొనసాగింపు ఏర్పాట్లపై శనివారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 2న ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాన్ని పార్వతీపురం ఐటిడిఎ ప్రాంగణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పిఎం ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్ కార్డులు నమోదు, పిఎం ఉజ్వల్ ఉచిత గ్యాస్, ఆధార్ కార్డుల నమోదు, జల్ జీవన్ మిషన్లో ఇంటింటికి కుళాయిలు, పివిటిజి గ్రామాల్లో రహదారులు వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల పురోగతిని వివరించే స్టాళ్లను అన్ని విభాగాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి, కేంద్ర ప్రభుత్వం నియమించిన నోడల్ అధికారి, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని ఆయన తెలిపాశారు. అనంతరం పిఎం జుగా వేదికను కలెక్టర్ పరిశీలించారు. సమావేశంలో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు వై.సత్యంనాయుడు, కె.రామచంద్రరావు, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి జి.రవి, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎస్.మన్మథ రావు, డిఇఒ జి.పగడాలమ్మ, జిల్లా మత్స్య శాఖ అధికారి వి. తిరుపతయ్య, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి కె.రాజ్‌కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏచూరి జీవితం ఉద్యమానికి ఆదర్శం



సీతారాం ఏచూరికి నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి - బలిజిపేట

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి ఆదర్శమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఇందిర, వై.మన్మధరావు కొనియాడారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి సిపిఎం నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇందిర, మన్మధరావు మాట్లాడుతూ గొప్ప మానవతావాది, మార్క్సిస్ట్ సిద్ధాంతకర్త, ఆర్థికవేత్త సీతారాం ఏచూరి అని కొనియాడారు. పేదలు, రైతులు, కార్మికుల విముక్తి కోసం తన రాజకీయ జీవితాన్ని త్యాగం చేశారన్నారు. సంఘ్ పరివార్, మతతత్వానికి వ్యతిరేకంగా సాగిన పోరులో సవాళ్లను ధీటుగా ఎదుర్కొన్నారని, అనేక దశల్లో జాతీయ రాజకీయాలను ప్రభావితం చేసేలా ఎత్తుగడలను రూపొందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఆయన ఆశయ సాధనకు పార్టీ సభ్యులు, సానుభూతిపరులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గేదెల సత్యనారాయణ, బొత్తాన భానుమూర్తి, బలరాంనాయుడు, వెంకటస్వామి, దన్నాన త్రినాధ, దుర్గారావు, వి.లక్ష్మి, సుధా సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఏచూరి సంస్మరణ సభ

పార్వతీపురం :సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్టు సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు తెలిపారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా రాష్ట్రమంత్రి సంధ్యారాణి, స్థానిక ఎమ్మెల్యే, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. కావున సభకు వామపక్ష, లౌకిక ప్రజాతంత్ర వాదులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



కురుపాం పోలీసు స్టేషన్‌ను పరిశీలిస్తున్న డిఎస్‌పి రాంబాబు

పోలీస్ స్టేషన్లు సందర్శించిన డిఎస్‌పి

ప్రజాశక్తి - కురుపాం

పాలకొండ డిఎస్‌పి ఎం.రాంబాబు గుమ్మలక్ష్మీపురం, కురుపాం పోలీస్ స్టేషన్లను శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్లో గల పలు రికార్డులను పరిశీలించి సూచనలు, సలహాలు అందించారు. అనంతరం కురుపాంలో గల ఆదర్శ పాఠశాల వద్ద విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.హరి, ఎస్ఐ శివప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భద్రగిరి ఐటిఐలో 91 సీట్లు భర్తీ

గుమ్మలక్ష్మీపురం : భద్రగిరి ఆర్‌ఐటిఐలో నాలుగో విడత కౌన్సిలింగ్‌లో 120 సీట్లు గానూ 91 సీట్లు భర్తీ చేసినట్లు ప్రిన్సిపల్ సిహెచ్ సునీల్ కుమార్ తెలిపారు. వెల్డరు, కోపా, డ్రెస్ మేకింగ్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, మోటార్ మెకానిక్ అన్ని విభాగాల్లో వంద శాతం సీట్లు భర్తీ చేసినట్లు తెలిపారు.

పొత్తు పొడవని మొక్కజొన్న

మోసపోయామంటూ లబోదిబోమంటున్న రైతన్న



తాను వినియోగించిన విత్తన ప్యాకెట్టును చూపుతున్న రైతు

ప్రజాశక్తి - మక్కువ

మొక్కజొన్న సాగు లాభసాటిగా ఉంటుందనుకొని సాగుకు ఉపక్రమించిన గిరిజన రైతులకు వారు వేసే విత్తనాలు పొత్తు పొడవకపోవడంతో మోసపోయామంటూ గిరిజన రైతులు లబోదిబోమంటున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టినా మొక్కలే తప్ప ఒక్క పొత్తు కూడా మొలవకపోవడంతో గిరిజన రైతుల రోదన మిన్నంటుంది. వివరాల్లోనికి వెళ్తే...

మండలంలోని నంద గిరిజన గ్రామానికి చెందిన పలువురు రైతులు అడ్వెంట రకానికి చెందిన మొక్కజొన్నను సాగు చేశారు. అయితే పంట చివరి దశకు చేరుకున్నప్పటికీ ఒక్క పొత్తు కూడా పొడవకపోవడంతో రైతులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టినప్పటికీ పంట చేతికి రాని విత్తనాన్ని సాగు చేశామని లబోదిబోమంటున్నారు. మండల కేంద్రంలోని ఎరువుల పురుగుమందుల విక్రయించే దుకాణాల్లో ఎప్పటిలాగే ఈ ఏడాదీ కొనుగోలు చేశామని రైతు మెల్లిక సొన్న, సూడిపల్లి వెంకన్న, తాడంగి సీతయ్య, రాజు, తదితర రైతులు చెబుతున్నారు. ఎప్పటి మాదిరిగానే మొక్కజొన్నకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు కూడా అవసరం మేరకు వాడడం జరిగిందని వారు తెలిపారు. అయితే పంట చివర దశకు చేరుకున్నప్పటికీ ఒక్క మొక్కజొన్న పొత్తు కూడా రాలేదని, చేనంతా ఎర్రబారిన గడ్డి మాదిరిగా తయారయ్యిందని ఆవేదన చెందుతున్నారు. సుమారు 20 ఎకరాల్లో పంట పూర్తిగా చేతికి రాకుండా పోయిందని గిరిజనులు కలత చెందుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తమను మోసగించిన విత్తనాలు విక్రయించిన వ్యాపారులపై చర్యలు తీసుకుని తమకు పంట నష్టపరిహారం అందించాలని గిరిజనులు కోరుతున్నారు

సీతంపేట ఎస్ఐకి బదిలీ

ప్రజాశక్తి -సీతంపేట

స్థానిక ఎస్సై ఎం.జగదీష్ నాయుడుకు సాలూరు బదిలీ అయింది. సీతంపేటకు వై.అమ్మన్నరావును నియమించారు. జగదీష్ నాయుడు సీతంపేటలో ఏడాదిన్నర పాటు పనిచేశారు.

డిప్యూటీ డిఎంహెచ్‌ఒగా పద్మావతి

ప్రజాశక్తి - పార్వతీపురం

డిప్యూటీ డిఎంహెచ్‌ఒగా డాక్టర్ కెవిఎస్ పద్మావతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇన్‌ఛార్జి డిప్యూటీ డిఎంహెచ్‌ఒగా డాక్టర్ జగన్మోహనరావు వ్యవహరించారు. రెగ్యులర్ డిప్యూటీ డిఎంహెచ్‌ఒగా పద్మావతి బాధ్యతలు స్వీకరించారు.

రైతుల సమస్యలు పట్టని 'మంచి ప్రభుత్వం'



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్టుగా ఉంది రైతుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం తీరు. 'ఇది మంచి ప్రభుత్వం' అంటూ ఊరూరా ఊదరగొట్టిన ప్రభుత్వ పెద్దలు, అధికారులు కూడా నవ్విపోదురుగాక నాకేటి అన్నట్టు ముందుకు సాగారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు కావస్తోంది. ఇప్పటి వరకు రైతులకు పూర్తిస్థాయిలో రుణాలు ఇవ్వలేదు. పెట్టుబడి సాయం కింద ప్రతి రైతుకూ రూ.20వేలు చొప్పున ఇస్తామన్న మాట నిలబెట్టుకోలేదు. గత ప్రభుత్వం రీసర్వే పేరిట చేసిన తప్పులు తడకలు అలాగే ఉన్నాయి. ఆన్‌లైన్‌లో వన్‌బిలు రాక, రిజిస్ట్రేషన్లు జరగక, ఇతర రూపాల్లో భూ సమస్యలు పరిష్కారం కాక రైతులు విలవిల్లాడుతున్నారు. జిల్లాలో కురిసిన కండపోత వర్షాలకు జలాశయాల గేట్లు ఎత్తివేసినా వరిచేనుకు నీరు అందని పరిస్థితి కనిపిస్తోంది. వీటికి పరిష్కారం చూపాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఇంటింటికీ సమస్యలు వెతుక్కుంటూ వెళ్లడం, పొలంబాట పేరిటా గొప్పలు చెప్పుకోవడం పట్ల రైతులు విస్తుపోతున్నారు. తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన రైతులు, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో రైతులు పెద్దఎత్తున ఆందోళన చేస్తుండడం ఇందుకు తార్కాణంగా చెప్పొచ్చు. పాలకొండ ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి ఆర్‌డిఒ కార్యాలయం వరకు ఇటీవల చేపట్టిన ర్యాలీతోపాటు ధర్నాలో పెద్దఎత్తున రైతులు పాల్గొన్నారు. ఇటు విజయనగరం జిల్లా కేంద్రంలోనూ ఎప్పటికప్పుడు రైతులు తమ సమస్యలపై నిరసనలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనులు ప్రారంభమై మూడు నెలలైందని, పంటల సాగు మదుపులకు డబ్బుల్లేక వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చాక పెట్టుబడి సాయం కింద రైతుల అకౌంట్లో రూ.20వేలు వేస్తామంటూ హామీ ఇచ్చినప్పటికీ, నేటికీ అమలుకు నోచుకోలేదు. ఈ నేపథ్యంలో తెలంగాణ మాదిరిగా రైతులకు రూ.2 లక్షలు వరకు రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఏడాది విజయనగరం జిల్లాలో ఇప్పటి వరకు 16,066 మంది కౌలురైతులకు మాత్రమే గుర్తింపు కార్డులు ప్రభుత్వం అందజేసింది. వీరిలో 50 శాతం మందికి కూడా రుణాలు ఇవ్వలేదు. ఈ ఏడాది కౌలురైతులకు రూ.70కోట్లకు తగ్గకుండా రుణాలు ఇప్పించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, ఇప్పటి వరకు కేవలం రూ.4.96 కోట్లు మాత్రమే ఇవ్వడం గమనార్హం. మరోవైపు ఎరువులు, పురుగుల మందుల ధరలు మాత్రం ఎంచక్కా పెంచేశారు. ట్రాక్టర్ అద్దెలు, ఇతర పనిముట్ల ధరలు, అద్దెలు కూడా పెరిగాయి. కౌలురైతులకు భూయజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలుకార్డులు, ఆ కార్డులపై బ్యాంకు రుణాలు ఇచ్చే విధంగా నిబంధనలు మార్పుచేయనున్నట్టు ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించిన సంగతి తెలిసిందే. కానీ, అటువంటి నిబంధనలేవీ తమకు ఇంకా రాలేదని బ్యాంకర్లు, రెవెన్యూ వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇవి చాలవన్నట్టు వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమౌతోంది. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు తగినంతగా నిధులు కేటాయించకపోవడంతో లక్ష్యానికి అనుగుణంగా సాగునీరు అందడం లేదు. ముఖ్యంగా కాలువల్లో పూడికతీత, తోటపల్లి వంటి ప్రాజెక్టు కింద పిల్లకాలువలు కూడా పూర్తి చేయలేదు. దీంతో, తోటపల్లి ఎడమ కాలువ కింద చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. మడ్డువలస జలాశయం నుంచి సాగునీరు అందక సంతకవిటి మండలంలో సుమారు 6 వేల ఎకరాల్లో వరి పంట ఎండిపోయింది. ఇటీవల ఆయా బాధిత రైతులంతా కలెక్టరేట్‌కు వచ్చి ఆందోళన కూడా చేపట్టారు. ఇలా ఒకటా రెండా అన్నీ సమస్యలేనంటూ ప్రభుత్వం తీరుపై విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన రైతులు రగిలిపోతున్నారు.

సెలవు పెట్టి వెళ్లిపోతాను : కమిషనర్

ప్రజాశక్తి - పాలకొండ

డంపింగ్ యార్డు విషయంలో పాలక వర్గం సహకరించకపోతే తాను సెలవు పెట్టి వెళ్ళిపోతానని నగర పంచాయతీ కమీషనర్ సర్వేశ్వరరావు అన్నారు. శనివారం నగర పంచాయతీ కార్యాలయంలో చైర్ పర్సన్ యందవ రాధా కుమారి అధ్యకతనలో కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డంపింగ్ యార్డు సమస్యపై జరిగిన చర్చలో కమిషనర్ మాట్లాడుతూ డంపింగ్ యార్డు విషయంలో నిరంతరం తాను దృష్టి పెడుతున్నానని, పాలక వర్గం కూడా సహకరించాలని అన్నారు. ఎక్కడైనా స్థలం గుర్తిస్తే మంచిదన్నారు. ప్రస్తుతం ఉన్న చెత్త జిందాల్ కంపెనీకి పంపించడానికి రూ.2లక్షలు ఖర్చవుతుందని కమిషనర్ చెప్పగా, దీనికి తీర్మానం చేశారు. అలాగే రాజాం నియోజకవర్గానికి కొంత చెత్తను తీసుకెళ్లాలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ డంపింగ్ యార్డు ఏర్పాటు విషయంలో పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. కోర్టు వివాదంలో ఉన్న టిడి పారాపురం స్థలాన్ని పరిష్కరిస్తే మంచిదన్నారు. దీనికి అధికార పార్టీ నాయకులు సహకారించాలని కోరారు. దీనిపై టిడిపి పట్టణ అధ్యక్షులు, 20వ వార్డ్ కౌన్సిలర్ ప్రతినిధి గంటా సంతోష్ మాట్లాడుతూ కోర్టులో ఉన్న స్థలంపై అధికారులు దృష్టి పెట్టి కొలిక్కి తీసుకురావాలని అన్నారు. టిడి పారాపురంలో ఉన్న తమ నాయకులతో కూడా ఎమ్మెల్యే మాట్లాడేలా చూస్తామన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ పల్లా ప్రతాప్, సభ్యులు వెలమల మన్మథ రావు, దుప్పాడ పాపినాయుడు, పల్లా భాను, కడగల రమణ, తుమ్మగుంట శంకరరావు, తదితరులు ఉన్నారు.

అర్హులకు ప్రభుత్వ ఫలాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

ప్రభుత్వ ఫలాల్లో ఎలాంటి వివక్షత లేకుండా, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేయాలని స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మన ఇల్లు మన గౌరవం కార్యక్రమం మండలంలోని కన్నపుదొరవలసలో ఎంపీపీ బొంగు సురేష్ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్టీఆర్ గృహాలు అర్ధాంతరంగా నిలిచిపోయినా, నిర్మాణాల వీలైనంత త్వరగా పూర్తి చేస్తే వారికి బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్చార్జ్ ఎంపిడిఒ కె.రామారావు, గృహ నిర్మాణశాఖ ఎఇ ఎల్.ఉమామహేశ్వరరావు, కూటమి నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : మండలంలోని మామిడిపల్లిలో మన ఇల్లు మన గౌరవం కార్యక్రమం జరిగింది. ఇన్ఛార్జ్ హౌసింగ్ పీడీ జె.శేకవ(?) నాయుడు లబ్ధిదారులతో మాట్లాడుతూ గతంలో మంజూరైన ఇళ్లను మార్చి 31 నాటికి పూర్తి చేయాలని, అలా పూర్తి చేసిన వారికి మిగతా బిల్లులు చెల్లిస్తామన్నారు(?). ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ వర్షాలలో ఇసుక దొరకడం లేదని, మెటీరియల్ ఖరీదు కూడా ఎక్కువ వుందని, మేస్త్రీలు అందుబాటులో లేదని తెలపగా డిఇ సోమశేఖర్ లబ్ధిదారులకు సంబంధించిన ఎటువంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ బి.అప్పలనాయుడు, టిడిపి నాయకులు బూసి తవుడు, తాడుతూరి తిరుపతిరావు, సువ్వాడ రామకృష్ణ, త్రినాథ్, సచివాలయం సిబ్బంది రాజు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



సీతంపేటలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

మక్కువ : మండలంలోని చెముడులో శనివారం నిర్వహించిన మన ఇల్లు మన గౌరవం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు జి.వేణుగోపాలనాయుడు మాట్లాడుతూ మండలంలో నిర్మించిన కాలనీలన్నింటి కంటే చెముడులో చేపట్టిన ఇళ్ల నిర్మాణం బాగుందని కొనియాడారు. స్థలం ఎంపికలో సర్పంచ్ బొంగు రాజేశ్వరి చొరవను ఆయన కొనియాడారు. మండలంలో 526 పెండింగ్ గృహాలు ఉన్నాయని హౌసింగ్ ఎఇ సింహాచలం తెలిపారు. వీటన్నింటిని అధికారులు సహాయ సహకారాలతో పూర్తి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 శ్యాంసుందర్, ఊరు మామిడి సర్పంచ్ కృష్ణంనాయుడు, స్థానిక ఎంపిటిసి గోపాలకృష్ణ మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని విక్రంపురంలో మన ఇల్లు మనగౌరవం కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఉదయభాస్కర్ మాట్లాడారు. గత ప్రభుత్వంలో మంజూరైన గృహాలకు సంబంధించిన బిల్లులందక అర్ధాంతరంగా నిలిచి వేశారని తక్షణమే పనులు ప్రారంభించాలని ఇందుకు బిల్లులు కూడా చెల్లింపులు జరుగుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు, ఎంపిటిసి సభ్యులు పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, ఎంపిడిఒ వై.వెంకటరమణ, గృహ నిర్మాణశాఖ ఎఇ వి.వినోద్కుమార్, మాచర్ల గీతానందీశ్వరరావు, ఎం.అప్పలనాయుడు, మాచర్ల అనిల్, కె.లక్ష్మణ్, ఎం.వెంకటరమణ, హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వరరావు, లబ్ధిదారులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


కురుపాం : ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు సకాలంలో నిర్మాణాలు పూర్తిచేయాలని ఎంపిడిఒ ఎస్.అప్పారావు అన్నారు. స్థానిక సచివాలయంలో మన ఇల్లు మన గౌరవం కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.రమణమ్మ, హౌసింగ్ ఎఇ జి.అచ్యుతమ్మ, వర్క్ ఇన్స్పెక్టర్ ఎస్.రాజేష్, కూటమి నాయకులు కోలా రంజిత్ కుమార్, కెవి కొండయ్య, ఎన్.వంశీ, జివి రమణమూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సాలూరులో ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సీతంపేట : మండలంలోని గొయిదిలో మన ఇల్లు మన గౌరవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మహమ్మద్ గియాజుద్దీన్, హౌసింగ్ ఎఇ వెంకటేష్ లబ్ధిదారులతో బిల్లుల మంజూరు ఆలస్యం జరగదన్నారు. మండలంలో పిఎం ఆవాస్ యోజన పథకం కింద 1109 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 149 పూర్తయ్యాయని తెలిపారు. మిగిలినవి త్వరితగతి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో గొయిది శిలగాం, దారభ పంచాయతీల సర్పంచులు, ఎంపిడిఒ కె.గీతాంజలి సీతంపేట, వెలుగు సిసి అనంత, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక రాజా కాలనీలో మన ఇల్లు మన గౌరవం కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి ఎంవి కరుణాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి నాటికి లబ్ధిదారులంతా ఇళ్లు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ జానకీరాం, పెదభోగిలి సర్పంచ్ జె.తెరేజమ్మ, ఉప సర్పంచ్ కె.అరవింద్ కుమార్, గ్రామ పెద్దలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు



బాధితునికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

చెక్కు అందజేసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

కొమరాడ మండలం విక్రంపురానికి చెందిన సంకిలి ఉదయ్ కుమార్ అనారోగ్యం, నడవలేని పరిస్థితుల్లో ఉన్నారని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆమె సిఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లగా సిఎం నిధి నుంచి సహాయం కోరడంతో వెంటనే స్పందించి రూ.4లక్షలు మంజూరు చేశారు. ఈ చెక్కును ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో బాధితునికి శనివారం అందజేశారు. కార్యక్రమంలో జనసేన నియోజక వర్గ సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు, అరకు పార్లమెంట్ రైతు అధ్యక్షులు దేవకోటి వెంకటనాయుడు, ఎంపిటిసి త్రినాథ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవిపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

ప్రతి విద్యార్థికి సుఖవ్యాధులు, హెచ్ఐవిపై అవగాహన ఉండాలని వైజాగ్ నెట్వర్క్ ఔట్ రీచ్ వర్కర్ ఎ.గీతారాణి అన్నారు. శనివారం స్థానిక కెజిబివి కళాశాల వద్ద విద్యార్థులకు మీకు తెలుసా? అనే కార్యక్రమం ద్వారా హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఐవి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి వివరించి హెచ్ఐవి సోకిన వారిని చిన్నచూపు చూడకుండా ఉండేలా ప్రజలంతా అవగాహన కలిగి ఉండాలన్నారు. వీటిపై విద్యార్థులు గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కె.తిరుపతిరావు విద్యార్థులు పాల్గొన్నారు.



వాల్పోస్టర్ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

మున్సిపల్ టీచర్ల సమస్యలపై దశలవారీ పోరాటం : యుటిఎఫ్

ప్రజాశక్తి - సాలూరురూరల్

మున్సిపల్ ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలపై దశల వారీ పోరాటం చేయనున్నట్టు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహన్రావు తెలిపారు. ఈ మేరకు ఆందోళనకు సంబంధించిన పోస్టర్లను శనివారం విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని మున్సిపల్ పాఠశాలల్లోని అన్ని పోస్టులను ఎస్ఎ క్యాడర్కు అప్ గ్రేడ్ చేసి ప్రమోషన్ ఇవ్వాలని, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ టీచర్లకు అర్బన్ ఎంఇఒల పోస్టులను ఇవ్వాలని మున్సిపల్ పాఠశాలలకు నాన్ టీచింగ్ స్టాఫ్ను కేటాయించాలని, బదిలీలు చేపట్టాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ అక్టోబర్ 2న సత్యాగ్రహ దీక్షలు, 17న డిఇఒ కార్యాలయాల వద్ద, 24 న డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వద్ద ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జానకిరామ్, పట్టణ, అర్బన్ కార్యదర్శులు శ్యామ్, ప్రదీప్, మండల నాయకులు గణేష్, సీతయ్య, రాజమణి, లక్ష్మి ,రమేష్ పాల్గొన్నారు.



ఎయు ప్రొఫెసర్కు చెక్కును అందజేస్తున్న కాలేజీ ప్రిన్సిపల్

వరద బాధితులకు రూ.51 వేలు విరాళం

ప్రజాశక్తి - కురుపాం

విజయవాడ వరద బాధితులకు ప్రపంచ వ్యాప్తంగా దాతలు విరాళాలు అందజేస్తున్న నేపథ్యంలో కురుపాం వైరిచర్ల కిషోర్ చంద్రదేవ్ డిగ్రీ కళాశాల సిబ్బంది, విద్యార్థులు స్పందించి రూ.51వేల 116 విరాళాలు సమకూర్చారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో విశాఖ ఆంధ్రా యూనివర్సిటీ ఆచార్యునికి శనివారం కళాశాల అధ్యాపకులు, సిబ్బంది వెళ్లి అందజేశారు. దీంతో యూనివర్సిటీ సభ్యులు కురుపాం డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులకు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వి.గురువులు, వైస్ ప్రిన్సిపల్ జి.మహేంద్ర, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగత్సింగ్ జయంతి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడుకూరు, బొడ్లపాడులో భగత్ సింగ్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. జనసేన ఉత్తరాంధ్ర నాయకులు బిపి నాయుడు, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సంయుక్త కార్యదర్శి జనసేన జాని భగత్సింగ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎం.పుండరీకం, ఎస్,అచ్యుతరావు, కె.సాయిపవన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

విద్యార్థులకు చట్టాలపై తప్పనిసరిగా అవగాహన ఉండాలని నీలకంఠాపురం ఎస్సై నీలకంఠరావు అన్నారు. మండలంలోని ధర్మలక్ష్మీపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలురు పాఠశాలను శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోక్సో, సైబర్ క్రైమ్, బాల్య వివాహాలు, డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాలు గూర్చి వివరించి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బంది వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

స్థానికజిల్లా కేంద్ర ఆసుపత్రి పారిశుధ్య సిబ్బందికి జీతాలు వెంటనే చెల్లించాలని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఆర్ వి ఎస్ కుమార్ డిమాండ్ చేశారు. ప్రభుత్వాసుపత్రుల్లో పనులు చేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్లు, సెక్యూరిటీ గార్డులు, సూపర్వైజర్ల బతుకులు కాంట్రాక్టర్ల చేతుల్లో పెట్టడంతో ప్రతి నెలా సక్రమంగా జీతాలు ఇవ్వడంలేదన్నారు. తక్షణమే అధికారులు స్పందించి కార్మికులకు వేతనాలు చెల్లించాలని కోరారు.

మూగ జీవాలను అక్రమ రవాణా చేస్తున్న మూడు వాహనాలు సీజ్

ప్రజాశక్తి - పాచిపెంట

నిబంధనలకు విరుద్ధంగా మూగ జీవులను అక్రమ రవాణా చేస్తున్న మూడు కంటైనర్లను సీజ్ చేసి సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటసురేష్ తెలిపారు. శనివారం పి.కోనవలస చెక్పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మూడు కంటైనర్లలో మూగ జీవులను ఒడిశా నుంచి మానాపురం సంతకు నిబంధనలకు విరుద్ధంగా కిక్కిరిసిపెట్టి మూగజీవుల రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ మూగ జీవులను కొత్తవలస గోసాలకు తరలించామన్నారు.

'చలో విజయవాడ'ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -కొమరాడ

విజయవాడలో అక్టోబర్ 2న జరిగే మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై తలపెట్టిన రాష్ట్ర సదస్సును జయప్రదం చేయలేని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని విక్రాంపురంలో మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలని, కనీసవేతనం రూ.12వేలు చెల్లించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని, ఎంఇఒలతో మీటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. వీటితో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్ సౌకర్యం కల్పించాలని, ప్రతి నెలా 5లోగా వేతనాల బిల్లులు చెల్లించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈ పథకాన్ని ప్రైవేటుపరం చేయకుండా కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు ఎస్.మహాలక్ష్మి, బి.సింహాచలమమ్మ పాల్గొన్నారు.

30న మున్సిపల్ సాధారణ సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఈనెల 30న సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గల కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 11గంటలకు మున్సిపల్ చైర్పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం ఉందని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర హాజరవుతారని, కావున కౌన్సిలర్లు, అధికారులు విధిగా హాజరు కావాలని సూచించారు.

జర్నలిస్ట్ గోపికి పరామర్శ

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం సీనియర్ జర్నలిస్టు చిప్పాడ గోపి తల్లిదండ్రులు ఇటీవల మరణించిన సంఘటన తెలుసుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణి శనివారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ శెట్టి పద్మావతి, జడ్పిటిసి జి. సుజాత, సర్పంచ్ జి.సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, ఎంపిటిసి వి.బంగారు నాయుడు, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, వైసిపి నాయకులు షేక్ నూరేళ్ల, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాలీ లేకుండా చెత్త ఎలా తీసుకెళ్తారు?

- నిరుపయోగంగా ట్రాక్టర్లు
- లక్షలాదిగా ప్రజాధనం వృథా

ప్రజాశక్తి -మక్కువ

సంపూర్ణ పారిశుధ్యం గ్రామాలుగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ సంకల్పం ఉన్నప్పటికీ వాటి నిర్వహణలో ఏర్పడ్డ లోపాల వల్ల లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగంగా మారుతోందని పలువురు విమర్శిస్తున్నారు. స్వచ్ఛ ఆంధ్ర మిషన్ ఆధ్వర్యంలో అధిక జనాభా కలిగిన పంచాయతీలకు గత ప్రభుత్వం చివరాంకంలో గ్రామాల్లో చెత్తను తొలగించేందుకు ట్రాక్టర్లను మంజూరు చేసింది. ఇందులో భాగంగా మండలంలోని కాశీపట్నం, మార్కొండపుట్టి, శంబర, పనసభద్ర పంచాయతీలకు నాలుగు పారిశుధ్య వాహనాలు (ట్రాక్టర్లు) మంజూరయ్యాయి. అయితే ట్రాక్టర్ ఇంజన్లు మాత్రమే ఇచ్చి ట్రాలీలు మాత్రం ఇవ్వలేదు. దీంతో ఒక్క ఇంజన్తో ఏ విధమైన పారిశుధ్య పనులు చేపట్టగలమని ఉద్యోగులు వాపోతున్నారు. దీంతో లక్షలాది రూపాయలు వెచ్చించి మంజూరు చేసిన ట్రాక్టర్లు మూలకే పరిమితమై తుప్పు పట్టే దశకు చేరుకుంటున్నాయి. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే ట్రాక్టర్తో పాటు ట్రాలీని కూడా అందజేయాల్సిన అవసరం ఉంది. ఇలా ఒక్క ఇంజిన్తో ఏ విధంగా పారిశుధ్యాన్ని పారబోయగలమని ఆయా పంచాయతీల ప్రజలు వాపోతున్నారు. ఒకటి, రెండు పంచాయతీల్లో అయితే వాహనాలు మంజూరయ్యాయన్న విషయాలు కూడా ప్రజలకు తెలియకపోవడం కొసమెరుపు. ఖాళీగా ఉన్న ట్రాక్టర్లు నిరుపయోగంగా ఉంటే పూర్తిగా చెడిపోయే ఆస్కారం ఉన్నంది. వీటిని అడపాదడపా వినియోగంలోకి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ట్రాక్టరుకు ట్రాలీ లేకపోవడంతో నిరుపయోగం ఓ మూలన వదిలేయాల్సి వస్తోందని ఉద్యోగులు వాపోతున్నారు. దీనిపై ఇఒపిఆర్డి దేవకుమార్ను 'ప్రజాశక్తి' వివరణ కోరగా ప్రభుత్వం ట్రాలీలు సరఫరా చేయలేదని తెలిపారు. పంచాయతీలకు వాటిని కొనుగోలు చేసే శక్తి కూడా లేదన్నారు. కావున అవి నిరుపయోగంగా పడి ఉన్నాయని తెలిపారు.



నిరుపయోగంగా పడి ఉన్న ట్రాక్టర్

కాలువ నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని గడసింగపురం ఎస్టి కాలనీలో ముగురు కాలువ నిర్మించాలని సిపెం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు కొల్లి గంగునాయుడు అధికారులను కోరారు. కాలనీలో నిలిచిపోయిన మురుగునీటిని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్టీ కాలనీలో రామమందిరం ఎదురుగా మురుగునీరు నిల్వ ఉండడం వల్ల మలేరియా, డెంగీ వంటి జ్వరాలు వచ్చే అవకాశం ఉందని, గిరిజనులు మురుగు కాలువ నిర్మించాలని కోరుతున్నప్పటికీ పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. వెంటనే మురుగు కాలువ నిర్మించి నీటిని బయటకు పంపించాలని, రోగాల నుంచి ప్రజలను కాపాడాలని కోరారు. అంతేకాక ఎస్సీ వీధిలో దళితులు అనేక ఏళ్లుగా సిసి రోడ్డు కావాలని కోరుతున్నారని, ఎస్సీ కాలనీలో గతంలో వేసిన సిసి రోడ్లు పాడైపోవడం వల్ల వెంటనే సిసి రోడ్డు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గరుగుబిల్లి రాజు తదితరులు పాల్గొన్నారు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - భామిని

స్థానిక బస్సు స్టాండ్ ఆవరణలో భగత్ సింగ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మెగా వైద్య శిబిరంలో రోగులకు రక్తపరీక్షలు, ఇజిసి, కిడ్నీ, మలేరియా పరీక్షలు నిర్వహించి, రోగులకు మందులను ఉచితంగా అందజేశారు. బిపి, సుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు కలిగిన రోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఈ మెగా వైద్య శిబిరం నిర్వహించామని భగత్ సింగ్ ట్రస్ట్ కన్వీనర్ ఎస్.హరి తెలిపారు. కార్యక్రమం పలు విభాగాల వైద్యులు, భగత్ సింగ్ ట్రస్ట్ సభ్యులు సంతోష్ కుమార్ శాంత్రో, పొగిరి రవి, వినోద్ కుమార్, పోలినాయుడు, చోడవరపు సింహాచలం పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణ శివారులో ఉన్న డంపింగ్ యార్డ్ నుంచి ఆర్టిఒ కార్యాలయం వరకు ఏర్పడ్డ పెద్దపెద్ద గుంతలను యువత స్వచ్ఛందంగా పూడ్చారు. పట్టణంలోని గడివీధి, కంచర వీధి యువకులు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ బి రమేష్, సిబ్బంది పర్యవేక్షణలో నిడగల్లుకు చెందిన పవన్ క్రసర్ స్టోన్ సహకారంతో శనివారం స్వచ్ఛందంగా ముందుకొచ్చి వాహనదారులు, ప్రయాణికులు పడుతున్న ఇబ్బంది అడిగి తెలుసుకొని పెద్ద, పెద్ద గుంతలను కప్పి కప్పారు. దీంతో వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తూ, యువతకు అభినందనలు తెలిపారు.



చెత్తశుద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ కృష్ణవేణి

ములగలో చెత్త శుద్ధి కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని ములగలో శనివారం సర్పంచ్ మడక కృష్ణవేణి, విశ్వనాథం ఆధ్వర్యంలో చెత్త శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామంలో ఉన్న వ్యర్థపదార్థాల నిర్వహణను బాధ్యతగా స్వీకరించి ఈ కేంద్రాన్ని ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తామన్నారు. గ్రామంలోని వ్యర్థపదార్థాలను తడి పొడి చెత్తగా సేకరించి ఎరువుల తయారీకి ఉపయోగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చిన్నంనాయుడు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్కు సాత్విక్ ఎంపిక

ప్రజాశక్తి - వీరఘట్టం

శ్రీకాకుళం జిల్లా ఆర్ట్ కళాశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-14 విభాగంలో వాలీబాల్ ఎంపిక పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల (బాలుర) కు చెందిన ఎ.సాత్విక్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్ ఉమామహేశ్వరరావు తెలిపారు. సాత్విక్ రాష్ట్ర స్థాయి పోటీకి ఎంపిక కావడంతో పట్ల ప్రధానోపాధ్యాయులు బి.సుంబోరా, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, అభినందనలు తెలిపారు.

బంగారం చోరీ

ప్రజాశక్తి వీరఘట్టం

మండలంలోని బిటివాడలో బమ్మిడి ముక్కల చంద్ర కళాదేవికి చెందిన ఆరున్నర తులాల బంగారం 37 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయని ఎస్ఐ జి.కళాధర్ తెలిపారు. పది రోజుల క్రితం ఈమె శ్రీకాకుళంలోని తన కుమార్తె వద్దకు వెళ్ళింది. ఆ తర్వాత ఇంటికి వచ్చి చూడగా బీరువా తాళం వేసినట్టు ఉన్నా అనుమానం వచ్చి తలుపులు తెరిచి చూసింది. బీరువాలో ఉన్న ఆభరణాలు లేకపోవడంతో అపహరణకు గురైనట్లు ఫిర్యాదుల పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

జిల్లా స్థాయి ఆర్చరీ ఎంపికలు

ప్రజాశక్తి - సీతంపేట

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఆర్చరీ ఎంపికలను అక్టోబర్ 1న నిర్వహిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 1న ఉదయం 9 గంటలకు స్థానిక ఎన్టీఆర్ గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో ఎంపికలు జరుగుతాయని తెలిపారు. అండర్ 14, 17, 19 విభాగాల్లో ఎంపికలు చేపడతామని తెలిపారు. ఈ ఎంపికలకు శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాలోని బాలురు, బాలికలు అర్హులని తెలిపారు.

బాబు మాటలు నమ్మొద్దు : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరురూరల్

భక్తులను అడ్డం పెట్టుకొని తిరుపతి లడ్డూలో పంది, ఆవు కొవ్వులను కలిపి లడ్డూ ప్రసాదం గతంలో తయారు చేశారని సాక్ష్యాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పడం పచ్చి అబద్ధమని, వారు చెప్పే తప్పుడు మాటలను ఎవరూ నమ్మొద్దని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. పాప ప్రాయచిత్ర నిమిత్తం స్థానిక కళ్యాణ వెంకటేశ్వర స్వామి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. తిరుపతి లడ్డూ ప్రసాదంలో ఎటువంటి తప్పు జరగకపోయినా తప్పు జరిగిందని చంద్రబాబు నాయుడు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తమ ప్రభుత్వం ఉంది కనుక విచారణ చేసి నిజానిజాలు నిగ్గు తేల్చాలని అప్పుడే ఎవరు తప్పు చేశారో తేలుతుందని అన్నారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో మత వర్గాల పేరుతో అల్లర్లు సృష్టించాలని బిజెపి, టిడిపి, జనసేన చూస్తొన్నాయని, వీరి వందరోజుల పాలనలో ప్రజలకు ఏమిచేసింది లేకపోవడంతో ఇలాంటి తప్పుడు మాటలు చెప్పి లబ్ధి పొందాలని అనుకుంటున్నారని, ప్రజలు వీరి మాటలు నమ్మి మోసపోవద్దు తెలిపారు. అలాగే జగన్ మోహన్రెడ్డి వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి కూటమి నాయకులు, హిందూ సంఘాలు డిక్లరేషన్ అడగడం విడ్డూరంగా ఉందన్నారు. ఎప్పుడూ అడగని డిక్లరేషన్ ఇప్పుడు అడగడం కేవలం రాజకీయ లబ్ధికోసమేనని విమర్శించారు. రాజ్యాంగ పదవుల్లో ఉండే సిఎం, డిప్యూటీ సిఎం ప్రమాణం చేసేటప్పుడు అన్ని మతాలను, అన్ని వర్గాలను గౌరవిస్తామని ప్రమాణం చేస్తారని, కానీ ఇప్పుడు మాత్రం కూటమి నేతలు ఒక మతం గురించి మాట్లాడడం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని అన్నారు. వీరు రాజ్యాంగ పదవుల్లో ఉండే అర్హత కోల్పోయారని, వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే మండలంలో మామిడిపల్లి ఉమా రామలింగేశ్వర ఆలయంలో మండల వైసిపి అధ్యక్షులు సువ్వాడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షుడు వంగపండు అప్పల నాయుడు, గిరి రఘు, వైసిపి కార్యదర్శి దండి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం : లడ్డుపై కూటమి నాయకులు రాజకీయం చేస్తూ మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. కురుపాం సమీపాన కస్పాగదవలసలో గల వెంకటేశ్వర స్వామి ఆలయంలో చంద్రబాబు నాయుడు మనసు మారి ప్రజలకు మంచి చేయాలని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైనా ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి కూడా అమలు చేయకుండా ప్రజలను పక్కదారి పట్టిస్తూ లడ్డు రాజకీయం చేస్తూ మత విధ్వంశాలను రెచ్చగొడుతూ ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అనవసరమైన రాజకీయాలు మానేసి తిరుపతి లడ్డుపై సిబిఐ దర్యాప్తు జరిపించి ప్రజలకు నిజాలు తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపిలు శెట్టి పద్మావతి, కె.దీనమ్మయ్య, జడ్పిటిసిలు జి.సుజాత, ఎం.శశికళ, రాధ, మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ జిలానీ, సర్పంచ్ జి.సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు అన్నాజీరావు, రంగారావు, ఎంపిటిసిలు వి.బంగారునాయుడు, టివిఎస్ స్వామియోజులు, జి.విద్యారాణి వైసీపీ నాయకులు, కార్యకర్తలు సంఖ్యలో పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : రాష్ట్ర ప్రజలను పట్టించడంలో చంద్రబాబు నాయుడు దిట్ట అని జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, మాజీ ఎమ్మెల్యే జోగారావు విమర్శించారు. తిరుపతి లడ్డూలో కల్తీ జరిగిందని అసత్య ప్రచారం చేస్తూ అపచారానికి ఒడిగట్టిన చంద్రబాబునే శిక్షించాలని, ప్రజలను రక్షించాలని కోరుకుంటూ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్పర్సన్, వైస్ చైర్మన్లు, మూడు మండలాల ఎంపిపిలు, జెడ్పిటిసిలు, వైస్ ఎంపిపిలు, మాజీ ఎఎంపి చైర్పర్సన్, మూడు మండలాల, పట్టణ పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ స్థాయి సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వైసిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మాజీ స్టేట్ డైరెక్టర్లు, ఎఎంసి మాజీ డైరెక్టర్లు, పిఎసిఎస్ మాజీ చైర్మన్లు డైరెక్టర్లు, జెసిఎస్ కన్వీనర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.



పార్వతీపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు



సాలూరులో పూజలు నిర్వహిస్తున్న మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

బలిజిపేట : చంద్రబాబునాయుడుకు సద్బుద్ధి ప్రసాదించాలని కోరుతూ బలిజిపేటలో వైసిపి శ్రేణులు పాప ప్రక్షాళన పూజలు వెంకటేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అలజంగి రవి, మండల వైసిపి అధ్యక్షులు మురళి, ఎంపిపి నాగమణి, వైస్ ఎంపిపి సాయి, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో చంద్రబాబు నాయుడు చేస్తున్న అసత్య ప్రచారాన్ని మానుకోవాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పి.విక్రాంత్ మాట్లాడుతూ తిరుపతి లడ్డు విషయంలో చంద్రబాబు నాయుడు లేనిపోని ఆరోపణలు చేసి కుల్లు రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి, చైర్పర్సన్ యందవ రాధాకుమారి, వైస్ ఎంపిపి కనపాక సూర్యప్రకాష్, వెలమల మన్మధరావు, కడగల రమణ, తుమ్మగుంట శంకరరావు, తూముల లక్ష్మణ, తదితరులు ఉన్నారు.